ట్రిపుల్‌ఐటీ ఆర్‌సీటీఎస్‌కు ప్రత్యేక నిధులు

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లోని రాజ్‌రెడ్డి సెంటర్ ఫర్ టెక్నాలజీ అండ్ సొసైటీ (ఆర్‌సీటీఎస్)కు 'ఏఐ ఫర్ ఆటోమేటెడ్ మాల్ న్యూట్రిషన్ డిటెక్షన్ ప్రాజెక్ట్' కోసం దాదాపుగా రూ.18 లక్షల నిధులను సైంటిఫిక్ నుంచి అందుకుంది. సైంటిఫిక్ యొక్క ఆర్థిక మద్దతుతో ఏఐ- శక్తితో కూడిన పోషకాహార లోపాన్ని గుర్తించే వ్యవస్థ కోసం కోర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను నిర్మించడానికి ప్లాట్ ఫారం అభివృద్ధి చేయనున్నారు.

హోమ్ ఓటింగ్‌పై శిక్షణ



హోమ్ ఓటింగ్‌పై సిబ్బందికి శిక్షణ ఇస్తున్న అధికారులు

గచ్చిబౌలి: హోమ్ ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్‌పై సిబ్బందికి అవగాహన కల్పించారు. మంగళవారం శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కార్యాలయంలో డిప్యూటీ జోనల్ కమిషనర్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఓటు వేసే రోజున నిర్వహించాల్సిన ఈవీఎం శిక్షణ, విధుల గురించి వివరించారు. మే 3 నుంచి 5వ తేదీ వరకు ఇంటి వద్దనే ఓటు వేసే వెసులుబాటు ఉంటుంది. ఈ ఓటింగ్‌కు 222 మంది ఓటర్లను గుర్తించగా 177 మంది ఓటర్లు 85 ఏళ్లకు పైబడిన వారు ఉండగా, 42 మంది పీడబ్ల్యూడీ, ముగ్గురు సేవా ఓటర్లు ఉన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో గుర్తించిన ఇళ్లకు ఓటింగ్ బృందం వెళుతుంది. ప్రిసైడింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్, పోలింగ్ అధికారి, మైక్రో అబ్జర్వర్, బూత్ లెవల్ ఆఫీసర్, కానిస్టేబుల్, వీడియో గ్రాఫర్ ఉంటారు. ఈ అవకాశాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. నోడల్ ఆఫీసర్ రజినీకాంత్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉషోదయ కాలనీలో కాంగ్రెస్ ప్రచారం

హఫీజ్‌పేట్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని హఫీజ్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ పూజిత జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని ఉషోదయ కాలనీలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హస్తం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అభివృద్ధే ప్రధాన ఎజెండాగా ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారం

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నందమూరినగర్‌లో చేవెళ్ల పార్లమెంట్ బీఆర్‌యస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ కుమారుడు కాసాని సాయి రాజేంద్రప్రసాద్‌తో కలిసి మంగళవారం స్థానిక కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి

మియాపూర్: అనుమానాస్పదస్థితిలో గుర్తు తెలియని మహిళ మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హఫీజ్‌పేట్ ప్రకాష్‌నగర్ కాలనీ కొత్తకుంట చెరువు సమీపంలో ఓ గుర్తుతెలియని మహిళ (30) మృతి చెందిందని, అక్కడ స్థానికులు మంగళవారం సాయంత్రం మియాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో మియాపూర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా ఆమెకు సంబంధించిన సమాచారం తెలియలేదు. చుట్టుపక్కల ఆరా తీయగా కొన్ని రోజులుగా చెత్త ఏరుకుంటూ ఉండేదని తెలిపారు. ఈ మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

మియాపూర్ : పనికి వెళ్తున్నానని చెప్పి వెళ్లిన వ్యక్తి తిరిగి రాని సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. మియాపూర్ మయూరినగర్‌లో ఉంటున్న ఎల్.సాయిలు(40) స్థానికంగా వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. ఏప్రిల్ 23వ తేదీ ఉదయం 11 గంటల సమయంలో పనికి వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. సాయంత్రం అయినా ఇంటికి తిరిగి రాలేదు. సాయిలు ఫోన్ ఇంటివద్దనే వదిలిపెట్టి వెళ్లాడు. దీంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు చుట్టుపక్కల, స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో ఆరా తీయగా ఆచూకీ లభించలేదు. సాయిలు భార్య మల్లేశ్వరి మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.



ఉషోదయ ఎన్‌క్లేవ్ వద్ద గుంతలమయంగా రోడ్డు

అమ్మో.. మంజీరా రోడ్డు

గుంతలమయం.. వాహనదారులకు నిత్యం ఇబ్బందులు

హఫీజ్‌పేట్: డివిజన్ పరిధిలోని మంజీరా రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. ఒకవైపు అభివృద్ధి పనులు.. మరోవైపు గుంతలతో రాకపోకలు ఎలా అని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంజీరా పైప్‌లైన్ రోడ్డులోని కల్కి అపార్ట్‌మెంట్ నుంచి హఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ వరకు ఉన్న రోడ్డు అధ్వానంగా మారింది. గుంతలలో పైప్‌లైన్ లీకేజీ నీరు చేరి రోడ్డు బురదమయంగా మారింది. ఈ రోడ్డులో రోజు వేలాదిమంది ఐటీ ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారు. పెద్ద పెద్ద గుంతలతో ప్రమాదాలు జరుగుతున్నాయని అలాగే అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు.

- మంజీరా రోడ్డు కిలోమీటర్ మేర పూర్తిగా గుంతలుపడింది
- పైప్‌లైన్ పనులు పూర్తి అయినా మరమ్మతులు చేయకపోవడంతో ఇబ్బందులుపడుతున్నారు
- రాత్రిపూట పాదచారులు, వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.
- ఒకవైపు పైప్‌లైన్ వేసిన వెంటనే రోడ్డు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



హఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ వద్ద ..



ప్రమాదాలు జరుగుతున్నాయ్



కల్కి అపార్ట్‌మెంట్ నుంచి హఫీజ్‌పేట్ ఫ్లై ఓవర్ వరకు వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టాలి. ద్విచక్ర వాహనదారులు గుంతలతో ప్రమాదాల బారిన పడుతున్నారు. వెంటనే ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.
– కుమార్, వాహనదారుడు

ట్రాఫిక్ సమస్య



మంజీరా రోడ్డులో ఉదయం, సాయంత్ర వేళలలో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంటుంది. ఆ సమయంలో ట్రాఫిక్‌ను మళ్లించాలి.
– మల్లేష్, వాహనదారుడు



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ లెక్చరర్లకు ప్రత్యేక శిక్షణ

హెచ్‌సీయూ ఎంఎంటీటీసీతో ఒప్పందం

రాయదుర్గం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉన్నత విద్యారంగంలో సామర్థ్యం పెంపుదల, ఎడ్యుకేషనల్ ఎకో సిస్టమ్‌ను మెరుగుపర్చడంపై హెచ్‌సీయూ మాలవ్య మిషన్ టీచర్ ట్రైనింగ్ సెంటర్ (ఎంఎంటీటీసీ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్‌ల మధ్య మంగళవారం ఒక ఒప్పందం కుదిరింది. హెచ్‌సీయూ ఎంఎంటీటీసీ అధికారులు, ఏపీ ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ అధికారులు సంతకాలు చేశారు. హెచ్‌సీయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బీజే రావు, కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనరేట్ కమిషనర్ డాక్టర్ పోల భాస్కర్ పాల్గొన్నారు.

కార్మికుల సమావేశాన్ని జయప్రదం చేయండి

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి



పటాన్‌చెరు టౌన్: కార్మిక సంఘాల సమావేశాన్ని జయప్రదం చేయాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు.మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్‌కు మద్దతుగా బుధవారం రామచంద్రాపురం పట్టణ పరిధిలో ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో కార్మికుల సమావేశానికి హాజరు కావాలంటూ మంగళవారం పలు పరిశ్రమల్లో కార్మిక సంఘాల నాయకులను కలిసి ఆహ్వాన పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...బీజేపీ ప్రభుత్వం గడచిన పది సంవత్సరాలుగా కార్మికులకు న్యాయం చేయలేదన్నారు.

కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది



కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, ఆర్యన్‌రెడ్డిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన చంద్రారెడ్డి తదితరులు

ఆల్విన్‌కాలనీ: కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్‌గౌడ్, ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి తనయుడు ఆర్యన్ రెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని ఆస్‌బెస్టాస్ కాలనీ బిర్లా కళ్యాణ మండపంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాపిరెడ్డినగర్, హనుమాన్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు చంద్రారెడ్డి, విఠల్, ఎండి. మెహరాజ్ బీఆర్‌యస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, సంక్షేమ సంఘాల సభ్యులు, మహిళా నాయకులు పార్టీలో చేరటం శుభ పరిణామమని పేర్కొన్నారు. పార్టీలో కష్టపడే ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. పార్టీలో చేరిన వారిలో రామకృష్ణారెడ్డి, నర్సింహులు ముదిరాజ్, కె.వి. రాజు, కిరణ్, వెంకటేష్‌గౌడ్, కనకారెడ్డి, సంపత్‌రెడ్డి, చంద్రయ్య, మల్లేష్, విజయ్, శ్రీకాంత్‌రెడ్డి, రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో...

ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ కాలనీకి చెందిన స్వరూప, మైనార్టీ యువ నాయకులు షఫీ, బషీర్‌తో పాటు పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి శేరిలింగంపల్లి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ శాలువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రామకృష్ణ గౌడ్, అనిల్ రెడ్డి, సమ్మారెడ్డి, సయ్యద్, రాజు ఉన్నారు.

నాయి బ్రాహ్మణ సంఘం ఆత్మీయ సమావేశం

నాయి బ్రాహ్మణ సంఘం ఆత్మీయ సమావేశంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వర రావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ నాయి బ్రాహ్మణులు చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు సంఘీభావం తెలిపారని అన్నారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, కృష్ణముదిరాజ్, మార్నెళ్ల శ్రీనివాసరావు, ఏకాంత్ గౌడ్, బాషి పాక యాదగిరి తదితరులు ఉన్నారు.

ఆలయ వార్షికోత్సవం



ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధి సుమిత్రనగర్‌లోని నాగదేవత అమ్మవారి అష్టమ వార్షికోత్సవంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావుతో కలిసి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మంగళవారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వివేకానందనగర్ బీఆర్‌యస్ పార్టీ అధ్యక్షులు సంజీవరెడ్డి, బీఆర్‌యస్ నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కర్, నాయినేని చంద్రకాంత్ రావు, అల్లం మహేష్, ఆలయ కమిటీ మెంబర్లు నర్సయ్య, బాలరాజు, నర్సింహచారి, కృష్ణంరాజు, యాదగిరి, వేణు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కారు గుర్తుకు ఓటువేసి గెలిపించండి

మియాపూర్: కారు గుర్తుకు ఓటువేసి చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అభ్యర్థించారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని న్యూకాలనీలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరిస్తూ ఓటును అభ్యర్థించారు.

2 నుంచి బీఆర్‌ఎస్ మహిళా విభాగం ప్రచారం

పటాన్‌చెరు టౌన్: బీఆర్‌ఎస్ పార్టీ మెదక్ లోక్‌సభ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా మే 2వ తేదీ నుండి 11వ తేదీ వరకు పార్టీ మహిళా ప్రజాప్రతినిధులు, మహిళా విభాగం ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఇంటింటి ప్రచారం చేయనున్నట్టు ఎమ్మెల్యే సతీమణి గూడెం యాదమ్మ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే నివాసంలో ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి సతీమణి ప్రణీతరెడ్డితో కలిసి ఆమె షెడ్యూల్ విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...మే 2వ తేదీ పటాన్‌చెరు డివిజన్, 3న రామచంద్రాపురం డివిజన్, 4న భారతినగర్ డివిజన్, 5న తెల్లాపూర్ మున్సిపాలిటీ, 6న అమీన్‌పూర్ మున్సిపాలిటీ, 7న బొల్లారం మున్సిపాలిటీ, 8న గుమ్మడిదల మండలం, 9న జిన్నారం ,10న పటాన్‌చెరు మండలం, 11న అమీన్‌పూర్ మండల పరిధిలో ఇంటింటి ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. పటాన్‌చెరు జెడ్పీటీసీ సుప్రజా వెంకట్‌రెడ్డి, ఎంపీపీ సుష్మా శ్రీ వేణుగోపాల్‌రెడ్డి, బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజా బాల్‌రెడ్డి, తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ లలిత సోమిరెడ్డి, రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నగేష్, పటాన్‌చెరు వైస్ ఎంపీపీ స్వప్న శ్రీనివాస్ పాల్గొన్నారు.

15 లీటర్ల మద్యం పట్టివేత

పటాన్‌చెరు టౌన్: రెండు బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించి 15 లీటర్ల మద్యంను పట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్ పరిధిలోని లింగమయ్య కాలనీలో సుశీల అనే మహిళ బెల్ట్‌షాప్ నిర్వహిస్తుందనే సమాచారం రావడంతో మంగళవారం పోలీసులు దాడులు నిర్వహించి, మద్యంను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.అదేవిధంగా సాయి కాలనీలో మహేష్ అనే వ్యక్తి బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో పోలీసులు దాడులు నిర్వహించి ఆరున్నర లీటర్ల మద్యం పట్టుకుని విక్రయిస్తున్న మహేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పదిలో గురుకుల బాలికలు టాప్

గౌలిదొడ్డి గురుకుల బాలికల హైస్కూల్‌లో 100 శాతం ఉత్తీర్ణత



వైష్ణవి (పది జీపీఏ) హర్షిణి (పది జీపీఏ) చందన (పది జీపీఏ) ప్రతిష్ఠ (పది జీపీఏ) త్రిష (పది జీపీఏ) సంజన (పది జీపీఏ) ప్రణతి (పది జీపీఏ) హాసిని (పది జీపీఏ) అక్షయ (పది జీపీఏ)

రాయదుర్గం: పదవ తరగతి ఫలితాలలో బాలికల హవా సాగింది. గౌలిదొడ్డి గురుకుల బాలికల పాఠశాల 100 శాతం ఫలితాలను సాధించారు. ఈ గురుకుల బాలికలంతా పేద కుటుంబాల నుంచి ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన వారు. ఇంగ్లిష్ మీడియంలో ప్రతిభ చాటారు. ఫలితాలను హైస్కూల్/కళాశాల ప్రిన్సిపల్ ఏ శారద వివరించారు. ఈ గురుకుల హైస్కూల్ నుంచి 69 మంది బాలికలు పరీక్షలు రాయగా అందులో అందరూ ఉత్తీర్ణత సాధించడం విశేషం. మొత్తం 69 మందిలో 10కి పది జీపీఏ సాధించిన వారిలో 9 మంది బాలికలు ఉండగా, 9.8తో 12 మంది, 9.7తో 11 మంది, 9.5జీపీఏతో అయిదుగురు బాలికలు ఉత్తీర్ణులయ్యారు.

శేరిలింగంపల్లి హైస్కూల్స్‌లో 72 శాతం ఉత్తీర్ణత..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి మండల పరిధిలోని జిల్లా పరిషత్ హైస్కూల్స్‌లోఎస్ఎస్‌సీ ఫలితాల్లో 72 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 13 హైస్కూల్స్‌లో 1060 మంది విద్యార్థులకు గాను 771 మంది విద్యార్థులు (72 శాతం) ఉత్తీర్ణత సాధించారు. మండల పరిధిలోని కొండాపూర్ హైస్కూల్‌లో 94.33 శాతం , మియాపూర్ హైస్కూల్‌లో 58 శాతం,, మక్తా మహబూబ్‌పేట్ స్కూల్‌లో 58 శాతం , శేరిలింగంపల్లి హైస్కూల్‌లో 77శాతం, లింగంపల్లి హైస్కూల్‌లో 58 శాతం, గచ్చిబౌలి హైస్కూల్‌లో 80.23 శాతం, మాదాపూర్ హైస్కూల్‌లో 67 శాతం, ఖాజాగూడ హైస్కూల్‌లో 81 శాతం , కొత్తగూడ హైస్కూల్‌లో 69 శాతం, రాయదుర్గం హైస్కూల్‌లో 87.4 ఉత్తీర్ణులయ్యారు. అదే విధంగా న్యూ హఫీజ్‌పేట్ ఉర్దూ మీడియం స్కూల్‌లో 75 శాతం, దర్గా ఉర్దూ మీడియం స్కూల్‌లో 76 శాతం, వేముకుంట ఉర్దూ మీడియం స్కూల్‌లో 67 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే రెసిడెన్షియల్ స్కూల్స్‌లో 93.33 శాతం ఉత్తీర్ణత సాధించారు.

రాయదుర్గం జెడ్పీహెచ్ఎస్‌లో 87.4 శాతం ..

గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో 127 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 54 మంది బాలురు, 73 మంది బాలికలు ఉన్నారు. అందులో బాలురు 49 మంది, బాలికలు 62 మంది మొత్తం 111 మంది ఉత్తీర్ణులయ్యారు. అందులో ఎండి సర్వర్ 9.3, టిభాస్కర్ 9.3, కె శశికాంత్ 9.2జీపీఏ సాధించి హైస్కూల్‌లో టాపర్లుగా నిలిచారు.ఈ సందర్భంగా జెడ్పీహెచ్ఎస్ ఎస్‌కే తాజ్‌బాబు మాట్లాడుతూ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు.

ఖాజాగూడ జెడ్పీహెచ్ఎస్‌లో 81 శాతం..

గచ్చిబౌలి డివిజన్‌లోని ఖాజాగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి ఫలితాల్లో 81 శాతం ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలలో బాలురు 34, బాలికలు 29 మంది మొత్తం 63 మంది ఉన్నారు. అందులో 51 మంది ఉత్తీర్ణలు అయ్యారు, అందులో బాలికలు 29 మంది, బాలురు 22 మంది ఉన్నారు. జే కల్పన 9.3 సాధించగా, వైశాలి 8.8 సాధించిందని జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.



ఎండి సర్వర్ (9.3) భాస్కర్ (9.3) శశికాంత్ (9.2)

ప్రతిభ చూపిన విద్యార్థినులకు సత్కారం

రాయదుర్గంలోని నాగార్జున ఉన్నత పాఠశాలలో పదిలో ఉత్తీర్ణత సాధించిన వారిని పాఠశాల కరస్పాండెంట్ భరత్‌కుమార్ మంగళవారం సన్మానించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినందించారు. హైస్కూల్‌ఓ పది జీపీఏ సాధించిన వారిలో ఆశ్రిత, స్పందన, గీతాంజలి, కుందన ఉన్నారు.



అత్యుత్తమ మార్కులు సాధించిన నాగార్జున ఉన్నత పాఠశాల విద్యార్థినులు

కేసీఆర్ రోడ్ షోపై ఎమ్మెల్యే సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ మెదక్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా మే 8వ తేదీ సాయంత్రం పటాన్‌చెరు పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సర్కిల్ వద్ద మాజీ సీఎం కేసీఆర్ రోడ్ షో జరగనుందని, నియోజకవర్గ పరిధిలోని పార్టీ శ్రేణులు రోడ్ షోకు హాజరవ్వాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. మంగళవారం ఇంద్రేశం, పెద్దకంజర్ల, చిన్న కంజర్ల, ఐనోలు, రామేశ్వరంబండ, బచ్చుగూడెం, పోచారం గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు పాండు, సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.